
# శ్రమ మీద గౌరవం



"మల్లయ్యా! ఓ మణుగు కట్టెలు కావా లయ్యా?" అని అడిగాడు రామారావు.

మల్లయ్య ఇటూ, అటూ తెల్లబోయినట్టుచూశాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?"

ఏంలేదు, దొరా! కూలివాళ్ళంతా ఇళ్ళకి వెళ్ళిపోయారు. పగటేళకి కాని రారు అందుకని."

"పోనీ తూచిపెట్టు. ప్రస్తుతానికి ఓ పది కట్టెలు పంపించు. మిగతావి సాయంత్రం పంపిద్దుగాని" అని రామారావు తన అవసరాన్ని వ్యక్తపరచాడు.

"గదేనండి ఆలోచిస్తుంట! జోకడానికి నాకేం అభ్యంతరంలేదు" అంటూ ఓ మణుగు కట్టెలు తూచాడు.

అంతట్లోకి అతని తమ్ముడు సురేశం వచ్చాడు. సురేశం బి. ఎ. చదివాడు. రామారావు శిష్యుడే! చాలాకాలంగా అతనే కట్టెలు వాళ్ళింటికి చేరేసి, మణుక్కి అణా తీసుకునేవాడు. కాని హైస్కూలు చదువు ప్రారంభమయ్యాక అట్లా శ్రమించడం మానేశాడు. అందులోనూ ఇప్పుడు గ్రాడ్యుయేటు కూడాను. సురేశం సైకిల్ స్టాండ్ వేసి లోపలికి వెళ్ళేడు.

"మీ తమ్ముడ్ని కాస్త సహాయం చెయ్యమను" అన్నాడు రామారావు.

"వాడా, దొరా?" అని నిట్టూర్చాడు మల్లయ్య.

"ఏం,?"

"వాడు యీ దరిదాపులకేరాడు. నేను, మా నాన్న యిన్నాళ్ళు కష్టించి, కట్టెలు, బొగ్గుల అంగడి నడుపుతూ వాడ్ని చదివించి పెద్దవాణ్ణి చేశాం. వాడికిప్పుడు వాళ్ళనాన్న, అన్నయ్య కట్టెలవ్యాపారస్థులంటేనే నామర్దా. అట్లాంటివాడు కట్టెలుకూడా మోస్తాడా? అంతే కాదు యితర చిన్న పిల్లల్ని కూడా యీ పనిజోలికి పోవద్దని ప్రోత్సహిస్తున్నాడు. వాళ్ళంతా ఆఫీసర్లు కావాలంట!"

మల్లయ్య విషాదంగానవ్వాడు. రామారావు సాలోచనగాచూశాడు. పోనీ మల్లయ్యానే సహాయం చేయమందామనుకున్నాడు. కాని, నోటిచివరి వరకువచ్చిన మాట అక్కడే ఆగిపోయింది. అంత పెద్దకట్టెల అంగడి సేటును ఏమని అడగగలడు?

"నువ్వు అన్నది నిజమే! మనదేశంలో శ్రమ విలువని మన ప్రజలు యింకా గుర్తించడంలేదు. శ్రమ మర్యాద పూర్వకమైనదని గుర్తించడంలేదు. విదేశాల్లో 'డిగ్నిటీ ఆఫ్ లేబర్'ని గుర్తించినంతగా మనదేశంలో గుర్తించడంలేదు. అమెరికాలో ప్రొఫెసర్లు వేసవినెలల్లో టాక్సీడ్రైవర్లుగాపనిచేస్తారుట. విశ్వవిద్యాలయ భవనాలకి, సున్నం వేసే కాంట్రాక్టు తీసుకుంటారుట. శ్రమమీది గౌరవం పెరిగే వరకూ మన దేశ సౌభాగ్య మిట్లాగే ఉంటుంది."

"గంతేనండి దొరా!" అన్నాడు మల్లయ్య.

"మల్లయ్యా! ఒక్కమాట చెప్పనా?"

"చెప్పండి."

"నీ అంతటి వాడివి నువ్వు: నా అంతటివాడ్ని నేను అవునా? ఈ స్వతంత్ర భారతదేశంలో

అందరిమీ సమానహోదలవే."

"గట్లానే సెప్తారండి."

"నువ్వు చదువుకోకపోయినా, నీ వ్యాపారం నువ్వు చేసుకుని, నీ పొట్ట నువ్వు పోషించుకుంటున్నావు. అందుకని నేననేదేమిటంటే, ఆ 'దొరా' 'దాండమ్', 'నీ బాన్చెకాల్మొక్తాను' అనే ఊరి పదాలన్నీ వాడ్డం మానెయ్యి. అవన్నీ భూస్వామ్య వ్యవస్థలో పుట్టాయి. ఈ ప్రజాస్వామ్య వ్యవస్థలో అవసరం లేదు."

"అయితే నేమనమంటారు ?"

" 'బాబూ.' అను 'అయ్యా' అను."

"గవిసరేగాని, పెద్దల్ని గౌరవించకపోతే ఏం బాగుంటుంది బాబూ "

'అవును, నిజమే, పెద్దల్ని గౌరవించడమనేది మన సంస్కృతిలో పాదుకొన్న ఉత్తమ లక్షణమే. ఐతే నేను అందుకు అభ్యంతరం చెప్పడంలేదు. నా బాధంతా మనల్ని మనం అగౌరవ పర్చుకో కూడదు. కించపర్చుకో కూడదు. ఇతరులకంటే తీసిపోయినట్టుగా మెలగరాదు "ఇచ్చి - పుచ్చుకోవడ" మనేది ప్రజాస్వామ్య సూత్రాల్లో ప్రథమ సూత్రం !

'మరి మన పోరగాళ్ళది గ్రహించడంలేదు, బాబూ ?"

అది గ్రహించేరోజు వస్తుంది. చదువుకున్నంత మాత్రాన శ్రమించరాదనుకోవడం అవివేకం. దేశానికి స్వేచ్ఛాపర్ణదగ్గర్నుండీ స్వీకర్లవరకూ అవసరం పడుతుంది. మానవశ్రమ లేందే మనం నవ సమాజాన్ని సృష్టించలేం. దానికి దైహికశ్రమా, మానసికశ్రమకూడా అవసరమే ! అవి పరస్పరం పోటీపడే విషయాలుకావు, ఒకదానికొకటి అనుబంధ విషయాలే !"

మల్లయ్య అర్థంకానట్టు చూడసాగేడు.

రామారావు దేశంలో సమానత్వం ఎప్పుడు ఏర్పడుతుందా ? శ్రమంటే గౌరవం ఎప్పుడు కలుగుతుందా ? అని ఆలోచించసాగేడు.

"బాబూ, పొద్దెక్కిపోతోంది - మీరు వచ్చినపని మర్చేపోయారు".

"కట్టెల సంగతేనా ?"

"అవునండి- నడవండి బాబూ, నాలుగుకట్టెలు నేను తీసికొచ్చి, మీ ఇంటికాడ పడేస్తా" అంటూ మల్లయ్య ఏడెనిమిదికట్టెలు చేతుల్లోకితీసుకున్నాడు.

"ఆగు మల్లయ్యా ?"

"ఏంటి, బాబూ ?"

"ఆ కట్టెలు నేనే మోసుకు పోతాను. అందులో అగౌరవమేమి లేదులే ! అక్కడ పెట్టు"

"మీరా ?"

"అవును !"

"నా కంఠంలో ప్రాణముండగా మీ చేతుల్తో వీటిని మోయనిస్తానా ? నాకింకా జ్ఞానం పోలేదు, బాబూ !"

"నామీద నీకుగల గౌరవానికి చాలా సంతోషంగా ఉంది, మల్లయ్యా ! కాని ఇందాకట్నించి నేను చెప్పినవన్నీ నువ్వు మర్చిపోయావు, కాని నేను మరవలేదు. అందుకని...నీవీ...ఓ సహాయం...చెయ్యి"

"ఏం సెయ్యమంటారు ?"

"ఆ కట్టెలు ఈ సైకిలువెనక పెట్టి ఓ తాడుతో కట్టెయ్యి అవి ఇంట్లో పడేసుకుని, సాయంత్రం ఆ తాడు మళ్ళీ తెచ్చిస్తా !'

"గదేంటి, బాబూ మళ్ళా !"

'అంతే ! నా పని నేను చేసుకోడానికి నే నెందుకు సిగ్గుపడాలి ? నేను చెప్పినట్టు చెయ్యి !"

మల్లయ్య మాట్లాడకుండా అట్లా చేశాడు రామారావు తనసైకిలుని నడిపించుకుని తన ఇంటివైపు పోసాగాడు.

సురేశం ఇంట్లోంచి బయటికి వచ్చి, తన పూర్వపు ఉపాధ్యాయుణ్ని చూసి పక్కుననవ్వేడు

"గట్లా నవ్వేదేందిరా ?" అన్నాడు మల్లయ్య తెల్లబోతూ.

" 'డిగ్నిటీ ఆఫ్ లేబర్'ట, 'డిగ్నిటీ ఆఫ్ లేబర్!' కట్టెల మోపు నెత్తిమీద పెట్టుకెళ్ళాల్సింది. తెల్సేవన్నుడు" అని నవ్వసాగేడు.

ఆ నవ్వువిన్న రామారావు సైకిల్ స్టాండ్ వేసి, కట్టెల మోపుని సైకిల్నుండి విప్పి నెత్తిమీద పెట్టుకుని, ఒకచేత్తో పట్టుకుని, మరోచేత్తో సైకిల్ నడుపుకుంటూ, వెనక్కి తిరిగి, సురేశం వంక చూశాడు, ఉత్సాహపూరితంగా.

నల్లనైన సురేశం మొహం ఎర్రగా కంద సాగింది.

★

# చంద్రలోకయాత్ర

(40 వ పేజీ తరువాయి)

కొన్రాడ్ జవాబు చెప్పాడు.

చంద్రునిపై తుపానుల సముద్రాన్ని పోలి వున్నది భూమిపై ఏదీ లేదని, పోలేకాన్ని ఎడారి ప్రాంతాలు దానిని కొంతపోలిఉంటే ఉండవచ్చునని కొన్రాడ్ చెప్పాడు.

భూమిపై విరివిగా దొరకని టిటానియం అక్కడ దొరుకుతుంది. ఆ లోహం అత్యంత ఉష్ణోగ్రతలోనూ, శబ్దవేది విమానాలకూ అది పనికివస్తుంది. దానిని చంద్రలోకంనుండి తెచ్చే సమస్య ఇంతలో సాధ్యంకాదు. కాని చంద్రునిపై టిటానియం నుపయోగించే పరిశ్రమలను నెలకొల్ప వచ్చునని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు.

పోతే చంద్రునిలో తక్కువ ఆకర్షణశక్తి, పూర్తి శూన్యం ఉండడం వలన కొన్ని రకాల ఎలక్ట్రానిక్ పరికరాలూ, యంత్రాలూ తయారుచేయవచ్చునట. బాల్ బేరింగు భూమ్మీదకన్నా అక్కడ ఇంకా ఎక్కువ ఖచ్చితంగా ఉండేవిధంగా తయారు చేయవచ్చునని భావిస్తున్నారు.

★

## ప్రగతి పాఠకులకు అభివందనలు !

చాలా కాలంగా జాబులు - జవాబులు శీర్షికను సక్రమంగా నిర్వహించ లేనందుకు తొలుత పాఠకులకు క్షమాపణలు చెప్పుకుంటున్నాము. మీ ప్రశ్నలకు జవాబులను ఎవరిచేత ఐతే వారిచేత గాక, ఒక ప్రత్యేకతను సంతరించుకున్న వ్యక్తిచేతనే ఇప్పించాలనేది మా సంకల్పం.

ఇకముందు నుంచి మీ ప్రశ్నలకు ప్రముఖ అభ్యుదయ రచయిత, మా సంపాదకవర్గ సభ్యులూ, ఆంధ్రదేశంలో అపూర్వ సంచలనం రేకెత్తించిన "మనుషులు మారాలి" చిత్రానికి వాడీ, వేడీ గల సంభాషణలు కూర్చి చలనచిత్ర ప్రపంచంలో ఒక ప్రత్యేకతను సంతరించుకొన్న

### శ్రీ బొల్లిముంత శివరామకృష్ణగారు

త్వరలో

జవాబు లిస్తారని తెలుపడానికి సంతోషిస్తున్నాము.

ఇట్లు,
మీ విధేయుడు,
ప్రధాన సంపాదకుడు.